క్లుప్తంగా

మహనీయుల జయంతి విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: మహనీయుల జయంతిని బడుగు, బలహీన వర్గాల ప్రజలు విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పిట్టల సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. ఈ నెల 5వ తేదీన బాబుజగ్జీవన్‌రామ్, 11న మహాత్మా జ్యోతిబాపూలే, 14న అంబేద్కర్ జయంతి వేడుకల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీశైలం, నక్క శంకర్, హరికృష్ణ, పోశం, నర్సింహులు, కవిత, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ చూపుతున్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: గోవాలో జరిగిన 3వ ఏషియన్ ఇంటర్నేషనల్ కరాటే పోటీల్లో కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి పథకాలు సాధించినట్లు కరాటే మాస్టర్ దేవయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పి.వినయ్, పి.వినోద్, ఎం.బిందుషా, అర్చన, రితేష్, జీశాన్‌లు ఇటీవల జరిగిన పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ఆయన వెల్లడించారు.

విద్యతోనే ఆదివాసీల అభివృద్ధి



సల్పలగూడలో మాట్లాడుతున్న సీఐ, ఎస్సై

వాంకిడి: ఆదివాసీ యువత విద్యపై దృష్టి సారించాలని, విద్యతోనే ఆదివాసీల అభివృద్ధి సాధ్యపడుతుందని సీఐ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని కనర్‌గాం గ్రామపంచాయతీ పరిధిలోని మారుమూల ఆదివాసీ గ్రామాలు చిలాటిగూడ, సల్పలగూడ, రొహిణి గూడ గ్రామాల్లో పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్‌లు మాట్లాడుతూ ఆదివాసీ యువత చదువుతో పాటు క్రీడలపై దృష్టి సారించాలన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తున్నట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కనర్‌గాం మాజీ సర్పంచ్ మధుకర్, గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

దండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మట్టల ఆదివారం వేడుకలను క్రైస్తవ భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈత, ఖర్జూర మట్టలతో ఊరేగింపు నిర్వహించారు. చర్చిల్లో ఆరాధనా కార్యక్రమాలు జరిపారు. సంఘ పెద్దలు సురేష్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం	: దసరా

కాగజ్‌నగర్

వెంకటరమణ	: దసరా

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సొరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజి	40

-ఆసిఫాబాద్‌అర్బన్

సమస్యల్లో సంత..!

- అస్తవ్యస్తంగా నిర్వహణ
- మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువు
- వేసవిలో తాగునీటికి అవస్థలు
- బెజ్జూర్, సలుగుపెల్లిలో వారసంతలు



టార్పాలిన్ల కింద దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు



బెజ్జూర్ వారసంతలో వృథాగా చేతిపంపు

బెజ్జూర్: వైబజార్ (వారసంత)లు సమస్యలకు నిలయంగా మారాయి. పంచాయతీలకు ఆదాయం సమకూర్చుతున్నా సౌకర్యాలు మాత్రం కానరావడం లేదు. మండల కేంద్రంతో పాటు సలుగుపెల్లిలో నిర్వహించే వారసంతల్లో ఎటు చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయి. సంతల్లో కనీస వసతులు లేకపోవడంతో వ్యాపారులతో పాటు వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా మరుగుదొడ్లు, తాగునీటి సమస్య వేధిస్తుంది.

పట్టించుకోని పంచాయతీ పాలకవర్గం..

సంత ద్వారా గ్రామ పంచాయతీలకు ఆదాయం వస్తున్నా సౌకర్యాలు కల్పించడంలో పంచాయతీ తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. మండల కేంద్రంతో పాటు సలుగుపెల్లి(లంబాడిగూడ)లో వారసంతలు నిర్వహిస్తున్నారు. బెజ్జూర్‌లో ఆదివారం, సలుగుపెల్లిలో గురువారం అంగడిబజార్‌లు నిర్వహిస్తున్నారు. బెజ్జూర్ సంత కోసం గతేడాది రూ.2లక్షల 70వేలకు వేలం ద్వారా ఆదాయం రాగా, ఈ ఏడాది వేలంలో రూ.3లక్షల 28వేలు సమకూరాయి. సలుగుపెల్లిలో గతేడాది రూ.2లక్షల 99వేలు, ఈ ఏడాది రూ.3లక్షల 10వేల 500 గ్రామపంచాయతీకి ఆదాయం వచ్చింది. కానీ అంగడి బజార్‌లలో మాత్రం అభివృద్ధి కానరావడం లేదు.

ఒంటికి.. రెంటికి తిప్పలే..

రెండు వారసంతలు అసౌకర్యాలకు నిలయాలుగా మారాయి. చిరు వ్యాపారులు ఎండలో ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ విక్రయాలు జరపాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతోపాటు సంతకు వచ్చే వినియోగదారులకు కనీసం తాగునీరు కూడా అందుబాటులో ఉండడం లేదు. మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో మహిళలు అనేక అవస్థలు పడుతున్నారు.

నిర్వహణ అస్తవ్యస్తం..

వారసంతల్లో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అసౌకర్యాల కారణంగా చిరు వ్యాపారులతో పాటు వినియోగదారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిరు వ్యాపారుల కోసం ఎలాంటి షెడ్లు లేకపోగా కనీసం గద్దెలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో రోడ్లపైనే కూర్చొని విక్రయాలు జరుపుతున్నారు. వర్షాకాలంలో వారసంతలు చిత్తడిగా మారుతున్నాయి. మురికి కాల్వలు లేకపోవడంతో వర్షపు నీరు నిల్వ ఉండి బురదమయంగా మారుతోంది. బెజ్జూర్ వారసంత లోతు ప్రాంతంలో ఉండడంతో వ్యాపారులు అనేక అవస్థలు పడుతున్నారు. మొరం వేయించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

అంగడిబజార్‌లో అనేక సమస్యలు



అంగడిబజార్‌లల్లో అనేక సమస్యలు రాజ్యమేలుతున్నాయి. రోడ్లు, డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షాకాలంలో నీరు గుంతల్లో నిలుస్తోంది. చిరు వ్యాపారుల కోసం కనీసం గద్దెలు కూడా నిర్మించడం లేదు. వారసంతలో తినుబండారాలు సైతం ఉండడంతో ఈగలు, దోమలు వాలి ప్రజలు అనారోగ్య సమస్యల బారిన పడే ప్రమాదం ఉంది. వేసవిలో తాగునీరు కరువైంది.

- భోగ ప్రశాంత్, బట్టల వ్యాపారి

అభివృద్ధి పనులు చేపడుతున్నాం

గ్రామపంచాయతీ తీర్మానం మేరకు వారసంతలో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. గతేడాది సలుగుపెల్లి(లంబాడిగూడ) వారసంతలో మొరం వేయించాం. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాం. ఈ ఏడాది సైతం అభివృద్ధి పనులు చేపడుతాం.

- విఠల్, పంచాయతీ కార్యదర్శి, లంబాడిగూడ

‘ఉపాధి’కి ఆసరా..!



ఖమానలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు

- పెరిగిన కూలీల వేతనం
- రూ.257 నుంచి రూ.272కు..
- 2023 -24 ఆర్థిక సంవత్సరంలో రూ.15 పెంపు
- వాంకిడి మండలంలో 11వేల మంది కూలీలకు ప్రయోజనం

వాంకిడి: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు వేతనాలు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచి పెరిగిన వేతనాలు కూలీలకు అందుతున్నాయి. దీంతో మండలంలో 11వేల మంది ఉపాధిహామీ కూలీలకు ప్రయోజనం చేకూరుతోంది. గరిష్ఠ వేతనం రూ.257 ఉండగా, 2023 -24 ఆర్థిక సంవత్సరంలో కూలీల వేతనం రూ.272కు చేరింది. రోజువారి గరిష్ఠ వేతనానికి అదనంగా మరో రూ.15లు కూలీలకు దక్కుతున్నాయి.

కొంత ఊరట..

వేసవి కాలంలో ఉపాధిహామీ పనులకు వెళ్లే కూలీలకు 5 నెలల పాటు అదనపు కూలీ కింద ప్రభుత్వం వేసవి భత్యం చెల్లించేది. కాగా గత సంవత్సరం నుంచి వేసవి భత్యం నిలిపివేసింది. ఈ క్రమంలో కూలీల వేతనం పెంచుతూ ఒక రోజుకు గరిష్ఠంగా ఉన్న రూ.257లను, రూ.272లకు పెంచడంతో వేసవి భత్యం లేమిలో కొంత ఊరట లభించింది. మండలంలో మొత్తం వర్కింగ్ జాబ్‌కార్డుదారులు 11వేలు ఉన్నారు. కాగా 2019 -20లో రూ.205 నుంచి రూ.211లకు, 2020 -21లో రూ.211 నుంచి రూ. 237లకు, 2021 -22లో రూ.237 నుంచి రూ. 245లకు, 2022 -23లో రూ.245 నుంచి రూ.257లకు వేతనాలు పెంచగా 2023 -24 ఆర్థిక సంవత్సరానికి రూ.272కు వేతనం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వేసవి అలవెన్సులు ఇవ్వాలి



ఉపాధిహామీ కూలీలకు పెంచిన వేతనం రూ. 15తో పాటు గతంలో అందించినట్లుగా వేసవి భత్యం కూడా అందించాలి. గతంలో వేసవి అలవెన్సు కింద రూ.30 చెల్లించేవారు. ఎండలను దృష్టిలో పెట్టుకుని అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

- సుగుణాకర్, ఉపాధి కూలీ, ఖమాన

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



రోజు వారి కూలీకి రూ.15 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏప్రిల్ నుంచి పెరిగిన వేతనాలు అమలవుతున్నాయి. ఇదివరకు కూలీల గరిష్ఠ వేతనం రూ.257 ఉండగా పెంచిన వేతనంతో కలుపుకుని రూ.272లకు చేరింది. జాబ్ కార్డు కలిగిన ప్రతీ ఒక్కరు పనులకు వెళ్లాలి.

- శ్రావణ్ కుమార్, ఏపీవో, వాంకిడి

నిరుపయోగంగా సెగ్రిగేషన్ షెడ్లు



మోతుగూడలో ఖాళీ స్థలంలో పడేసిన చెత్త

- ఖాళీ స్థలాల్లో దర్శనమిస్తున్న చెత్త
- పట్టించుకోని అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: పల్లెలను పరిశుభ్రంగా మార్చడంతో పాటు చెత్త ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చేందుకు ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సేంద్రియ ఎరువులుగా మార్చేందుకు నిర్మించిన సెగ్రిగేషన్ (కంపోస్టు) షెడ్లు నిరుపయోగంగా మారాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షెడ్లు నిర్వహణ లేక అస్తవ్యస్తంగా మారాయి.

మండలంలో ఇదీ పరిస్థితి..

మండలంలో మొత్తం 26 గ్రామపంచాయతీల్లో డంపింగ్ యార్డులకు అనుసంధానంగా కంపోస్టు షెడ్లు నిర్మించారు. ఒక్కోదానికి రూ. 2.50లక్షల చొప్పున వెచ్చించారు. గ్రామ పంచాయతీ పరిధిలో ప్రతీ ఇంటి నుంచి ట్రాక్టర్ ద్వారా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుల్లో తడి, పొడి చెత్తగా వేరు చేయాల్సి ఉండగా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. గ్రామంలో సేకరించిన చెత్తను ట్రాక్టర్‌లో తీసుకెళ్లి డంపింగ్ యార్డులో కాకుండా ఖాళీ స్థలంలో పడేస్తున్నారు. దీంతో లక్షల రూపాయలతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా మారాయి.

సిబ్బంది కొరత..

పారిశుధ్య కార్మికులు ఇంటింటా చెత్త సేకరిస్తున్న సమయంలో ఇళ్ల యజమానులు తడి, పొడి చెత్తను ఒకే దాంట్లో వేసి ఇస్తున్నారు. షెడ్ల వద్ద వేరు చేసేందుకు పంచాయతీల్లో సిబ్బంది కొరత ఇబ్బందిగా మారింది. కార్మికులు మురుగు కాలువలను శుభ్రం చేయడం, చెట్లకు నీరు పోయడం, ఇతర పనులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. చెత్తను వేరు చేసి ఎరువు తయారు కావాలంటే 45 రోజులు పడుతుంది. కాని అనేక పంచాయతీల్లో ఎరువు తయారీపై దృష్టి సారించడం లేదు.

జీపీలదే బాధ్యత

ఉపాధిహామీ పథకం ద్వారా కంపోస్టు షెడ్లను నిర్మించాం. వాటి నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీలపైనే ఉంది. ఎరువు తయారీకి సిబ్బంది కొరత వేధిస్తోంది. - చంద్రశేఖర్, ఏపీవో

ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి

బెజ్జూర్: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎంపీవో రమేశ్ రెడ్డి, సర్పంచ్ కోట్రంగి శారదా భీమన్న, ఉప సర్పంచ్ అడ్డురి రాజేష్, నాయకులు దేవాజీ, జావిద్, మహేష్, నరేందర్ గౌడ్, సురేష్ గౌడ్, వెంకటేష్, అరుణ్, సిరాజ్, భీమన్న శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామపంచాయతీలతో పాటు, మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 313వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జుమ్మిడి సౌందర్యతో పాటు పంచాయతీ కార్యాలయాల్లో సర్పంచులు పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ బహుజన రాజ్యస్థాపన చేసిన మొదటి చక్రవర్తి పాపన్న గౌడ్ అన్నారు. కార్యక్రమాల్లో ఎంపీటీసీలు మధునయ్య, శ్రీనివాస్, సర్పంచులు అహల్యాదేవి, సుమలత, కోఆప్షన్ సభ్యుడు జహురోద్దీన్, సూపరింటెండెంట్ వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మహిళా మండల అధ్యక్షురాలు అరుణ, శంకరమ్మ, శ్రీనివాస్‌గౌడ్, ఆనంద్, మురళీగౌడ్, చిరంజీవిగౌడ్, భరద్వాజ్ పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆదివారం పాపన్నగౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు మాట్లాడుతూ అన్ని వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయుడన్నారు. ఆయన జీవితచరిత్రను గుర్తు చేశారు. మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ సంతోష్‌గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు దామోదర్, ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్, నాయకులు పడాల బాపుగౌడ్, కోంద్ర రాజాగౌడ్, శ్రీనుగౌడ్, నరేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



రెబ్బెన: పాపన్నగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ సౌందర్య

తిర్యాణిలో..

తిర్యాణి: సబ్బండ వర్గాలకు ఆత్మగౌరవ స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడు సర్వాయి పాపన్న గౌడ్ బహుజనుల ఆరాధ్యుడు అని మోకుదెబ్బ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. పాపన్న గౌడ్ 313వ వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో బహుజన సంఘాల ఆధ్వర్యంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి మార్క శంకర్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శంకర్ గౌడ్, మండల అధ్యక్షుడు జుంగోని అశోక్ గౌడ్, రజక సంఘం మండల ఉపాధ్యక్షుడు నల్లూరి రాజు, కుమ్మర సంఘం నాయకులు ఎర్ర వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

వాంకిడిలో..

వాంకిడి: మండల కేంద్రంలోని స్థానిక గ్రామ పంచాయతీ కేంద్రంలో సర్పంచ్ బండె తుకారాం అధ్యక్షతన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 313వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మండల జెడ్పీటీసీ అజయ్‌కుమార్, గౌడ సంఘం అధ్యక్షులు మల్లాగౌడ్, శంకర్‌గౌడ్‌లు హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.

కౌటాలలో..

కౌటాల: సర్వాయి పాపన్నగౌడ్ బహుజన వీరుడని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. కౌటాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం సర్దార్ పాపన్న గౌడ్ వర్ధంతి నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య, సర్పంచ్ మౌనిశ్, ఉపసర్పంచ్ తిరుపతి, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షులు రవీందర్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు విలాస్‌గౌడ్, ఫణిందర్‌గౌడ్, అంజన్న గౌడ్, అశ్విన్, ఆత్మారాం, అశోక్ పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలో ఆదివారం సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ డుబ్బుల నానయ్య సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులు అర్పించారు. మండలంలోని బాబాసాగర్, అడెపెల్లి, అనుకోడ, గ్రామాలలో గౌడ సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఎంపీడీవో మహేందర్, ఆయా గ్రామాల సర్పంచులు గౌడ సంఘాల నాయకులు నీలాగౌడ్, రామాగౌడ్, తిరుపతి గౌడ్, దీపక్ గౌడ్ పాల్గొన్నారు.



తిర్యాణిలో..



బెజ్జూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



వాంకిడిలో..



దహెగాం: చిత్రపటానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ



కౌటాల: నివాళులర్పిస్తున్న ఎంపీపీ విశ్వనాథ్



చింతలమానెపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



సిర్పూర్ (టి): హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది



కెరమెరి: బోర్డుపై నంబర్లు వేస్తున్న సిబ్బంది

సిర్పూర్(టి): నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు పరీక్షలకు ఆదివారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మొత్తం నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల పరీక్ష కేంద్రాన్ని ప్రైవేట్ పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేయగా మిగిలిన మూడు పరీక్ష కేంద్రాల్లో 599 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

కెరమెరిలో..

కెరమెరి: నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు సీఎస్ ఆడే ప్రకాశ్ తెలిపారు. మండలంలో కెరమెరి, మోడిలో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. కెరమెరిలో 165 మంది, మోడిలో 175 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

హాల్ టికెట్ల పంపిణీ..

మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఆదివారం హాల్ టికెట్లను మండల ప్రత్యేకాధికారి ఆడే ప్రకాశ్ పంపిణీ చేశారు.

కౌటాలలో..

కౌటాల: నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి వార్షిక పరీక్షల కోసం విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల వ్యాప్తంగా 350మంది విద్యార్థులు కౌటాల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలలో పరీక్షలు రాయనున్నారు. ఇందుకు 21 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, బెంచీలు, పరీక్ష సమయంలో ప్రతీ కేంద్రం వద్ద ఆరోగ్య సిబ్బంది, మెడికల్ మందులు అందుబాటులో ఉంచనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది.

నార్నూర్‌లో..

నార్నూర్: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో రాపల్లి ఆశన్న అన్నారు. నార్నూర్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల పరీక్ష కేంద్రంలో 185 మంది, జెడ్పీ ఉన్నత పాఠశాల తాడిహత్నూర్‌లో 176, గాదిగూడ మండలంలోని ఆశ్రమ బాలురు పాఠశాలలో 107 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రానికి విద్యార్థులు సకాలంలో చేరుకోవాలని సూచించారు.

‘ప్రజాపోరాటాలతోనే సమస్యలు పరిష్కారం’

బెల్లంపల్లి : ప్రజా పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్ అన్నారు. బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి గంగారాం నగర్‌కు చెందిన 50మంది ఆదివారం సీపీఐలో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ గంగారాంనగర్ శాఖ కార్యదర్శిగా దురిశెట్టి సంతోష్, సహాయ కార్యదర్శిగా బన్న గంగారాం, కోశాధికారిగా ఇప్ప రమేష్‌ను ఎన్నుకున్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో అనేక సమస్యలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయని, వీటి పరిష్కారం కోసం పోరాటాలు సాగించడానికి కార్యాచరణ తయారు చేస్తున్నామన్నారు. త్వరలోనే అసెంబ్లీ నియోజకవర్గంలో పాదయాత్ర చేపట్టబోతున్నట్లు, ప్రజలు సంపూర్ణ మద్దతు ప్రకటించి పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు.